# ట్రేడింగ్‌కు డీమ్యాట్ తప్పనిసరి

ఏదైనా షేర్లు కొనాలన్నా లేక అమ్మాలన్నా డీమ్యాట్ అకౌంట్ తప్పనిసరి. ఆన్‌లైన్ ట్రేడింగ్ విధానం బాగా ప్రాచుర్యం పొందుతుండటంతో డీమ్యాట్ అకౌంట్ అవసరం మరింతగా పెరుగుతోంది. తక్కువ నిడివితో, పారదర్శకమైన లావాదేవీలు, స్టాక్ మార్కెట్స్‌పై నియంత్రించే సెబీ, సులభమైన సెటిల్‌మెంట్ విధానం ఇలా అనేక విషయాలు ఇన్వెస్టర్లను ట్రేడింగ్ వైపుకు ఆకర్షిస్తున్నాయి. వీటన్నింటికి కావల్సిన డీమ్యాట్ అకౌంట్ గురించి ఈ వారం తెలుసుకుందాం..

ఎలక్ట్రానిక్ ఫాంలో షేర్ల లావాదేవీలు సాగడమే ఈ డీమెటీరైలేజషన్.. సంక్షిప్తంగా డీమ్యాట్ అంటారు. దేశంలో డీమ్యాట్ సేవల కోసం డిపాజిటరీలుగా ఎన్‌ఎస్‌డీఎల్, సీడీఎస్‌ఎల్‌లు వ్యవహరిస్తున్నాయి. ఈ రెండు సంస్థల మధ్య సభ్యత్వం తీసుకున్న మెంబర్లను 'డిపాజిటరీ పార్టిసిపెంట్(డీపీ)' అంటారు. ప్రముఖ స్టాక్‌బ్రోకర్లందరూ ఈ డీపీలుగా వుండి ఇన్వెస్టర్లకు సేవలందిస్తున్నారు. కొన్ని బ్యాంకులు కూడా ఈ సేవలను అందిస్తున్నాయి. మార్కెట్లో కొన్న షేర్లను భద్రపర్చుకోవడానికి డీమ్యాట్ అకౌంట్స్ ఉపయోగపడతాయి. షేర్లను అమ్మినప్పుడు సదరు కొనుగోలుదారుడు కూడా షేర్లను డీమ్యాట్ అకౌంట్‌లోంచే తీసుకుంటాడు. అలాగే పాత షేర్లు ఫిజికల్ రూపంలో వుంటే వాటిని ఎలక్ట్రానిక్ రూపంలో అంటే డీమ్యాట్ అకౌంట్‌లోకి మార్చుకోవచ్చు.

ఇక డీమ్యాట్ అకౌంట్ ఎక్కడ తెరవాలి?.. లావాదేవీలు ఏ సంస్థ ద్వారా నిర్వహించాలన్న విషయాలు ఆయా పెట్టుబడిదారుల ఎంపికపై ఆధారపడి ఉంటుంది. సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద సభ్యత్వం పొందిన ఏ బ్రోకర్ వద్దనైనా, అలాగే డిపాజిటరీ వద్ద సభ్యత్వం వున్న డీపీ వద్దనైనా డీమ్యాట్ ఖాతా ప్రారంభించవచ్చు. షేర్ల కొనుగోలు, అమ్మకాలకు ట్రేడింగ్ ఖాతాను, కొనుగోలు చేసిన షేర్లను భద్రపర్చుకోవడానికి డీమ్యాట్ ఖాతాను ఉపయోగించుకోవాలి.



**వేణుగోపాల్ జాగర్లమూడి**
సర్టిఫైడ్ ఫైనాన్స్యల్ ప్లానర్, జెన్‌మనీ

## వీటిని పరిగణనలోకి తీసుకోండి

- స్వభావ రీత్యా షేర్లలో ఇన్వెస్ట్‌మెంట్ రిస్క్‌ను కలిగివుండి. కాబట్టి పెట్టుబడి చేసేముందు లాభనష్టాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నిర్ణయం తీసుకోండి.
- లావాదేవీలను స్టాక్ ఎక్స్ఛేంజ్/మెంబర్ల ద్వారానే జరపాలి. గుర్తింపు లేని థర్డ్ పార్టీ ద్వారా వీటిని నిర్వహించరాదు.
- స్టాక్ మార్కెట్‌ద్వారా వ్యవహారాలను నిర్వహిస్తే చట్టబద్ధతతో పాటు పన్ను ప్రయోజనాలను పొందవచ్చు.
- లావాదేవీలు జరిపిన 24 గంటల్లోనే కాంట్రాక్టు నోట్‌ను పొందండి.
- మీ ఖాతాలకు సంబంధించి ముఖ్య సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోండి.

